



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

బుధవారం,
ఏప్రిల్ 29, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




# పెట్రోల్ పరేషాన్

## వదంతులతో పెరిగిన డిమాండ్

**సరఫరా పెరిగినా తగ్గని ఒత్తిడి**

**బంకుల వద్ద భారీ క్యూలో వాహనదారులు**

**వ్యవసాయం, రవాణాపై తీవ్ర ప్రభావం**

**సరిహద్దు ప్రాంతాల్లో మరింత గందరగోళం**

రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న తరుణంలో ఇంధన సమస్య కొత్త ఆందోళనకు దారితీసింది. కొన్ని పెట్రోలు బంకులు తాత్కాలికంగా మూసివేయబడటం వాహనదారుల్లో అనిశ్చితిని పెంచుతోంది. చమురు సంస్థలు సాధారణ స్థాయిని మించి సరఫరా పెంచుతున్నప్పటికీ వినియోగం విపరీతంగా పెరగడంతో నిల్వలు నిలకడగా ఉండటం లేదు. కొరతపై ప్రచారం ఎక్కువ కావడంతో ప్రజలు అవసరానికి మించి కొనుగోలు చేస్తుండటం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. తెల్లవారకముందే బంకుల వద్దకు చేరుకునే వాహనదారులు, సిబ్బంది రాకముందే

(మిగతా 2వ పేజీలో)

# శుక్రాచార్యుడు ఫాంహౌస్‌లో పడుకున్నాడు: రేవంత్

**ఫ్యూచర్ సిటీలో సీపీ భవనానికి సీఎం రేవంత్ శంకుస్థాపన**

**ప్రపంచస్థాయి నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని హామీ**

**రైతులు భూములిచ్చి సహకరించాలని విజ్ఞప్తి**

**ప్రతిపక్షాల మాటలు పట్టించుకోనని వ్యాఖ్య**



హైదరాబాద్ : ప్రజలను భాగస్వాములను చేస్తూ ఫ్యూచర్ సిటీని అధునాతన నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందరూ కలిసి పనిచేస్తేనే సిటీ నిర్మాణం సాధ్యమవుతుందని సీపీ భవన శంకుస్థాపన కార్యక్రమంలో స్పష్టం చేశారు. ఈ నగరం భావితరాలకు వరంగా మారుతుందని పేర్కొన్నారు. అయితే, ఫ్యూచర్ సిటీ నిర్మాణం అంత సులభం కాదని వివరించారు. ఈ సందర్భంగా విపక్ష నేతలపై తనదైన శైలిలో సెటైర్లు వేశారు. కొంత మంది ఫ్యూచర్ సిటీ నిర్మాణం విషయంలో తనను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని రేవంత్ అన్నారు. "మీరు ఏడుస్తూనే ఉండండి.. నేను చేసుకుంటూ పోతూనే ఉంటా" అంటూ తనదైన శైలిలో ప్రతిపక్షాలకు చురకలు అంటించారు. శుక్రాచార్యుడు ఫాంహౌస్ లో పడుకున్నాడని, మారీచుడు, సుబాహుడు జనంలో తిరుగుతున్నారంటూ బీఆర్ఎస్ అగ్రనేతలను ఉద్దేశించి అన్నారు. టోక్యో, సియోల్, సింగపూర్ వంటి ప్రపంచ స్థాయి నగరాలతో పోటీ పడేలా ఫ్యూచర్ సిటీని నిర్మించడమే తమ లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆ దిశగా రోడ్లు సహా అన్ని మౌలిక సదుపాయాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా జూన్ 2లోపు ఫ్యూచర్ సిటీ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తామని

(మిగతా 2వ పేజీలో)

# మహిళా రిజర్వేషన్ల లక్ష్యాన్ని సాధిస్తాం

**ప్రతిపక్షాలే అడ్డంకిగా ఉన్నాయని ప్రధాని విమర్శ**

**శాసనసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగేందుకు కృషి**

**వారణాసిలో జరిగిన మహిళల సమావేశంలో ప్రధాని మోదీ**



వారణాసి: వారణాసిలో జరిగిన మహిళల సమావేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మహిళా రిజర్వేషన్ల అంశాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. చట్టసభల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణకు ప్రతిపక్ష పార్టీలు అడ్డంకులు సృష్టించాయని ఆయన విమర్శించారు. కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే వంటి పార్టీలు ఈ ప్రక్రియను ముందుకు సాగనివ్వలేదని అన్నారు. తన పార్లమెంటు నియోజకవర్గమైన వారణాసిలో మహిళలతో మాట్లాడిన సందర్భంగా ఆయన, మహిళా సాధికారత దేశ అభివృద్ధికి కీలకమని స్పష్టం చేశారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయడం తన ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలలో

(మిగతా 2వ పేజీలో)




# మా ఫోన్లు హ్యాక్ అవుతున్నాయి

**ఐపీఎస్ అధికారులపై హరీశ్‌రావు విమర్శలు**

**ఆధారాలు బయటపెడతామనని వెల్లడి**

**రిటైరైనా చర్యలు తప్పవని హెచ్చరిక**

సంగారెడ్డి : భారాస సీనియర్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై, ముఖ్యంగా కొందరు ఉన్నతాధికారులపై తీవ్ర ఆరోపణలు చేశారు. చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తున్న ఐపీఎస్ అధికారులను వారు పదవీ విరమణ చేసినా వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. అవసరమైతే పూర్తి స్థాయి విచారణ జరిపించి నిజాలను బయటపెడతామని హెచ్చరించారు. సంగారెడ్డి జిల్లా కంది కారాగారంలో రిమాండ్‌లో ఉన్న పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్‌తో పాటు మరికొందరు కార్యకర్తలను పరామర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు చేసిన హరీశ్‌రావు,

(మిగతా 2వ పేజీలో)

# బెంగాల్‌లో రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధం

**తీర్పు చెప్పనున్న మూడు కోట్లకు పైగా ఓటర్లు**

**కీలక నియోజకవర్గాల్లో హోరాహోరీ పోటీ**

**అధికారానికి నిర్ణయాత్మక దశగా రెండో విడత**



కోల్‌కత్తా: పశ్చిమబెంగాల్‌లో రెండో దశ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలక దశగా భావిస్తున్న ఈ విడతలో 142 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. అధికారాన్ని కొనసాగించాలనే లక్ష్యంతో తృణమూల్ కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా, ప్రభుత్వాన్ని గద్దె దించాలని భారతీయ జనతా పార్టీ దూకుడుగా ప్రచారం సాగించింది. ఈ నేపథ్యంలో ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందన్న ఆసక్తి నెలకొంది. దాదాపు పదేళ్లకు పైగా అధికారంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నాయకత్వానికి ఇది కీలక పరీక్షగా మారింది. మరోవైపు బీజేపీ రాష్ట్రంలో తన ప్రభావాన్ని మరింత విస్తరించేందుకు తీవ్రంగా శ్రమించింది. మొదటి విడత పోలింగ్‌లో భారీగా ఓటింగ్ నమోదవ్వడం తమకు అనుకూల సంకేతమని బీజేపీ భావిస్తుండగా, సంక్షేమ పథకాల ఆధారంగా ప్రజల మద్దతు తమకే ఉంటుందని

(మిగతా 2వ పేజీలో)

## ఇరాన్ పతనం అంచున ఉంది.. వాళ్లే మాకు చెప్పారు: ట్రంప్



**హార్ముజ్ దిగ్బంధనాన్ని ముగించాలని ఇరాన్ కోరిందన్న ట్రంప్**

**ఇరాన్ తమ నాయకత్వాన్ని చక్కదిద్దుకునే పనిలో ఉందని వ్యాఖ్య**

**అంతర్గత విభేదాలను వారు పరిష్కరించుకోవాలని సూచన**

## తెలంగాణ రాష్ట్ర నూతన డీజీపీగా సీవీ ఆనంద్




**ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్న శివధర్ రెడ్డి**

**సీవీ ఆనంద్‌ను డీజీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్ సీపీగా ఎ పనిచేసిన సీవీ ఆనంద్**

## కూతురు అడిగే ప్రశ్నలకు కేసీఆర్ సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నారు: మహేశ్‌గౌడ్

**కేసీఆర్ కుటుంబం సొంత వివాదాలతో సతమతమవుతోందన్న టీపీసీసీ చీఫ్**

**కేసీఆర్ కుటుంబం పదవుల కోసం పాకులాడుతోందని విమర్శ**

**ప్రజలు బీఆర్ఎస్‌ను విశ్వసించడం లేదన్న మహేశ్ కుమార్ గౌడ్**



# ఉచిత శిక్షణతో ఉద్యోగం వైపు అడుగులు



కల్వకుర్తి ఏప్రిల్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:–

కల్వకుర్తి పట్టణంలో నిరుద్యోగ యువతకు మార్గదర్శకంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చేతుల మీదుగా నాల్గవ ఉచిత ఎస్సై ఢ కానిస్టేబుల్ శిక్షణ కేంద్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..నేటి నిరుద్యోగ అభ్యర్థులను రేపటి అధికారులుగా తీర్చిదిద్దడమే నా లక్ష్యం. గ్రామీణ యువతలో ప్రతిభ ఉన్నా అవకాశాల కొరత ఉంది. ఆ లోటును భర్తీ చేయడానికే ఈ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నాం" అని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం కేవలం ఉపాధి మాత్రమే కాకుండా కుటుంబ గౌరవం, సమాజ సేవకు అవకాశమని పేర్కొన్నారు. అతిథులు మాట్లాడుతూ.. గ్రామీణ యువతకు ఇలాంటి వేదికలు ఎంతో అవసరమని, ఫీజులు కట్టలేని విద్యార్థులకు ఇవి ఆశాకిరణాలుగా మారుతున్నాయని అభినందించారు. శిక్షణలో చేరిన విద్యార్థులు తమకు లభించిన ఈ అవకాశంపై ఆనందం వ్యక్తం చేస్తూ, ఉద్యోగం సాధించి నమ్మకాన్ని నిలబెడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసున్న , జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్, సీనియర్ పాత్రికేయులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.



## జిల్లా యువజన క్రీడల శాఖ- సంస్థాన్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాల బాలికలకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ

### థైక్యాండో -యోగ- అథ్లెటిక్స్ విభాగాలలో 8 నుండి 14 సంవత్సరాల వారికి శిక్షణ

వార్త మిర్రర్ స్టేట్ బ్యూరో

సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ క్లబ్ నారాయణపురం మరియు జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మే 1 వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు నిర్వహిస్తున్నామని స్పోర్ట్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు సిలివేరు సైదులు తెలపడం జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 1వ తేదీ నుండి మే 31వ తేదీ వరకు ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు సాయంత్రం నాలుగు గంటల నుండి 6 గంటల వరకు టైక్వాండో యోగ మరియు అథ్లెటిక్స్ విభాగాలలో 8 నుండి 14 సంవత్సరాలలోపు బాల బాలికలకు ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని బాలబాలికలు ఉపయోగించుకోవాలని ఈ సందర్భంగా వారు తెలుపడం జరిగినది. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు బలగొని యాదయ్య, స్పోర్ట్స్ క్లబ్ సభ్యులు బద్దుల మురళి యాదవ్, విజన్ ఆంధ్ర రిపోర్టర్ సికీలమెట్ల ప్రభాకర్, శ్రావణ్, దోమలపల్లి కిరణ్, శివ, లక్ష్మణ్, సురేష్, సందీప్, యశ్వంత్ కుమార్, యాదయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు

## రైతు కూలీ బిడ్డకు డాక్టరేట్ -- ఊరు నుంచి ఉస్మానియా వరకు విజయగాథ



సికింద్రాబాద్, ఏప్రిల్ 28 (వార్త మిర్రర్): మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం సారంగపల్లి గ్రామానికి చెందిన రైతు కూలీ కుటుంబం నుంచి వచ్చిన రామగిరి శేఖర్ తన ప్రతిభతో ఉన్నత విద్యలో అరుదైన విజయాన్ని సాధించారు. రామగిరి లింగయ్య -- రత్న దంపతుల పెద్ద కుమారుడైన శేఖర్, గ్రామం నుంచి ప్రారంభమైన తన విద్యా ప్రయాణాన్ని హైదరాబాద్‌లోని ఓయూ వరకు తీసుకెళ్లి బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. ప్రొఫెసర్ డా. ఆర్. వెంకటేశ్వర్ రావు మార్గదర్శకత్వంలో '»The Role of Consumer Durable Finance in Electronics Retail in Hyderabadµµ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్‌ను సాధించారు. చిన్నతనంలోనే తల్లిదండ్రుల కష్టాలను చూసి చదువుపై దృష్టి సారించిన శేఖర్, కృషి, పట్టుదలతో ఈ స్థాయికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ప్రొఫెసర్లు, సహచరులు ఆయనను అభినందిస్తూ, పేద కుటుంబం నుంచి వచ్చిన విద్యార్థి 100 ఏళ్ల చరిత్ర కలిగిన ఓయూ డాక్టరేట్ సాధించడం ప్రేరణాత్మకమని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా లక్ష్యంతో ముందుకు సాగితే ఉన్నత విద్యలో గొప్ప విజయాలు సాధించవచ్చని అన్నారు. డా. రామగిరి శేఖర్ మాట్లాడుతూ, తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు, పరిశోధనలో మార్గనిర్దేశం చేసిన గురువులకు, తన ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆయన విజయంతో సారంగపల్లి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు.




## బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యునిగా దేవుడు కుమార్ నియామకం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఎప్రిల్ 28..

బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యునిగా దేవుడు కుమార్ నియామకం కావడం గౌరవప్రదమైన సందర్భంగా నిలిచింది. పార్టీ పట్ల ఆయన చూపుతున్న నిబద్ధత, కృషి, సేవలను గుర్తిస్తూ పార్టీ నాయకత్వం ఈ బాధ్యతను అప్పగించింది. ఈ సందర్భంగా గౌతమ్ క్రాంతి కుమార్ చేతుల మీదుగా దేవుడు కుమార్ నియామక పత్రాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో మెట్టుగూడ డివిజన్‌కు చెందిన ఆదర్శ్ ముదిరాజ్, సత్తూరి రవీందర్, సీనియర్ నాయకుడు మల్లేష్, భూస్పాక్ శ్రీనివాస్ రావు, సీనియర్ రామకృష్ణతో పాటు పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొని ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం శాలువాలతో ఘనంగా సత్కరించి, ఆయన భవిష్యత్ రాజకీయ ప్రస్థానానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ నియామకంతో దేవుడు కుమార్ పార్టీకి మరింత సేవ చేయడంతో పాటు, సమాజ అభివృద్ధికి కృషి చేస్తారని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం -- రాహుల్ గాంధీని ప్రధాని చేయాలని పిలుపు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 28 : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి, వచ్చే ఎన్నికల్లో తిరిగి ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. దేశ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేసి, రాహుల్ గాంధీని ప్రధానిగా నిలబెట్టడం లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త పని చేయాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో జరిగిన కీలక సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్‌తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ సంస్థాగత బలోపేతం, క్షేత్రస్థాయిలో కేడర్‌ను చురుకుగా మార్చడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ బీఎల్‌ఏల నియామకాలు, మండల కమిటీలు, గ్రామ కమిటీలు, జిల్లా కమిటీల ఏర్పాటుకు పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో నాయకులు స్థానిక స్థాయిలో చురుకుగా పనిచేసి పార్టీకి బలం చేకూర్చాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామ స్థాయి వరకు ప్రభుత్వ పథకాల అమలు, వాటి ప్రయోజనాలను ప్రజలకు చేరవేయడంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని అన్నారు. ఈ సందర్భంగా బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, రాబోయే రెండు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకమని, ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేస్తే పార్టీ మరింత బలపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ విజయాలను ప్రజలకు చాటిచెప్పుతూ, కేంద్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన దిశానిర్దేశం ఇవ్వడంతో పాటు, పార్టీ బలోపేతానికి నాయకులు సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించారు.

# కోరుట్ల గడి స్థలాలు కాపాడాలని విఎల్టీలు రద్దు చేయించాలని కోరుతూ బిజెపి కౌన్సిలర్లతో సంతకాల సేకరణ.

**- సంపూర్ణ మద్దతు ప్రకటించిన బిజెపికి ధన్యవాదాలు**

**- అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు వెల్లడి**









కోరుట్ల వార్త మిర్రర్ ప్రతినిధి, ఏప్రిల్ 28. కోరుట్ల గడి బురుజుల స్థలాలు కాపాడాలని నకిలీ దస్తావేజులతో ఇంటి నెంబర్ 6-4-228 లో ఏకకాలంలో పరిధికి మించి ముప్పై సంవత్సరాల పన్నును వసూలు చేయడమే కాకుండా పేరు మార్పిడి తో పాటు 5800 గజాల కు విఎల్టీలు వేసిన కమీషనర్ పై చర్యలు తీసుకోవాలని వాటిని రద్దు చేయించాలని కోరుతూ ఐదు రోజుల నిరసన దీక్షల అనంతరం సంతకాల సేకరణ ప్రారంభించిన అఖిలపక్ష ప్రజాసంఘాల నాయకులు మొదటి రోజు బిజెపి కౌన్సిలర్లతో సంతకాల సేకరణ చేశారు. ఈసందర్భంగా బిజెపి పట్టణ అధ్య క్షుడు, కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు తిరు మల వాసు, కులాల రాధ సాయి చంద్, రుద్ర సుజాత శ్రీనివాస్, జి శ్రీకాంత్, సొరపాక రమేష్ లను కలిసి మున్సి పల్ కౌన్సిల్ లో మెజారిటీ కౌన్సిలర్ లతో విఎల్టీలు రద్దు చేయించాలనే సంకల్పంతో సంతకాల సేకరణ ప్రారంభించినట్లు తెలుపగా దానికి బిజెపి కౌన్సిలర్లు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ సంతాకాలు చేయడమే కాకుండా సిడిఎంఎ కు నేరుగా కలిసి పిర్యాదు చేస్తామని తెలిపిన బిజెపి కౌన్సిలర్ లకు ఈసందర్భంగా ధన్యావాదాలు తెలిపారు. ఈ సంతకాల సేకరణ లో అఖిలపక్ష ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ పేట భాస్కర్, ఎండి ముజా హిద్, తుమ్మనపల్లి శ్రీనివాస్ బాబు, చింత భూమేశ్వర్, సు తారి రాములు, భూపెల్లి నగేష్, షాహేద్ మహ్మద్ షేక్, కుం చెం శంకర్ కౌన్సిలర్లు సంపూర్ణ మద్దతు ప్రకటించారు

# తార్నాకలో బీఆర్ఎస్ గులాబీ జెండా ఆవిష్కరణ



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 28 :

తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన గులాబీ జెండాను తార్నాక సండే మార్కెట్ ఆటో స్టాండ్ వద్ద బీఆర్ఎస్ నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించబడింది. ఎమ్మెల్యే పద్మారావు సూచనల మేరకు, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశయ సాధనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. "అందరికీ అండదండ -- మన గులాబీ జెండా" అనే నినాదాలతో కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారిలో నాయకులు జింకల మల్లేష్, గుండెల్లి మదుకర్, సాయి కుమార్, జోగు రాకేష్, అరుణ్, చంద్రన్న, బాబు, కృష్ణస్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. తెలంగాణ ప్రజలకు, పార్టీ శ్రేణులకు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

# రాయికల్ మున్సిపాలిటీ కో ఆప్షన్ మెంబర్ల ఎన్నిక



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 28

జగిత్యాల జిల్లా రాయికల్ పురపాలక సంఘమునకు నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యుల ద్వారా తెలంగాణ మున్సిపాలిటీ కోఆప్షన్ మెంబర్ రూల్స్ 2020 అనుగుణంగా కో- ఆప్షన్ మెంబర్లను ఎన్నుకొనుటకు గాను ప్రత్యేక సమావేశం (కొ-ఆప్షన్ మెంబర్ ఎన్నిక) పురపాలక సంఘ కార్యాలయం నందు. తేది:28.04.2026 మంగళవారం రోజున ఉదయం 11.00 గంటలకు నిర్వహించనైనది. మున్సిపల్ పరిపాలనలో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన ఇద్దరు సభ్యులలో శ్రీ వల్లకొండ మహేష్, మహిళా సభ్యురాలుగా సుదవేని లత ఎన్నిక కాబడినారు. అల్పసంఖ్యాక వర్గము (మైనారిటీ)నకు చెందిన ఇద్దరు సభ్యులలో శ్రీ ఇర్ఫాన్ అలీ, మహిళా సభ్యురాలుగా శ్రీమతి యం.డి. ఇంత్యాజ్ పర్వీన్ ఎన్నిక కాబడినారు. ఎన్నిక అనంతరం ఎన్నిక కాబడిన కో-ఆప్షన్ సభ్యులకు కమీషనర్ కీర్తి నాగరాజు ఎన్నికల ధృవపత్రాలను అందించారు. అనంతరం చైర్మన్, వైస్ చైర్ పర్సన్, కౌన్సిలర్లు ఎన్నిక కాబడిన కో-ఆప్షన్ సభ్యులను సన్మానించినారు. ఇట్టి సమావేశములో చైర్మన్ కట్కం రవీంధర్, మున్సిపల్ కమీషనర్ కీర్తి నాగరాజు, వైస్-చైర్పర్సన్ శ్రీమతి తురగ సౌజన్య, వార్డు కౌన్సిలర్లు తోపారపు ప్రశాంతి, శ్రీ భుక్యా రాకేష్ నాయక్, కూనారపు మానస, వేముల మౌనిక, ఎలిగేటి లతిక, శ్రీ పల్లికొండ గంగాధర్, మహేశ్వరి బత్తిని, మచ్చ గంగలక్ష్మి, శ్రీ పుర్రె శ్రీధర్, శ్రీ కల్లెడ చిన్న ధర్మపురి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇటిక్యాల లో ఘనంగా ఎల్లమ్మ తల్లి బోనాలు



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 28

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో మంగళ వారం రోజున గౌడ సంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ తల్లి బోనాలు అంగరంగ వైభవంగా గౌడ శెట్టి ముత్యంపేట నర్సయ్య బృందం చే అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు..ఉదయాన్నే గౌడ మహిళలంతా బోనం వండుకొని నెత్తిపై పెట్టుకుని పురవీధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగుతూ ఎల్లమ్మ తల్లి అమ్మవారికి తమ పిల్లలను కుటుంబ సభ్యులను చల్లగా చూడాలని బోనం ను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి, గౌడ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ గౌడ్ హాజరైనారు.. అనంతరం అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, గౌడ సంఘ సభ్యులు, కౌడిన్య యూత్ సభ్యులు, మహిళలు నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కట్కాపూర్ లో హిందూ సమ్మేళనం కరపత్రం ఆవిష్కరణ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 28

హిందూ సమ్మేళన సమితి కట్కాపూర్ శాఖ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం కరపత్రం సర్పంచ్ పడాల పూర్ణిమ తిరుపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కట్కాపూర్ లో గల శ్రీ సాయిబాబా గుడి ఆవరణ లో మే-1 శుక్రవారం ఉదయం-11 గంటల నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు ఆధ్యాత్మిక మహోత్సవం కార్యక్రమం జరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఇంటింటి నుండి ప్రతీ మహిళామూర్తి మంగళహారతులతో రావాలని మంగళహారతులతో వచ్చిన వారికి శ్రీగోమాతా ప్రతిమలు అందజేసి వేదపండితుల చేత గోపూజ చేయించడం జరుగుతుందని, భజన, సామూహిక శ్రీ హనుమాన్ చాలీసా పారాయణం వుంటుందని ఈ కార్యక్రమాలలో పాల్గొనే వారి యొక్క సకల గ్రహదోషాలు, భూత,ప్రేత పిశాచాలు, నరదిష్ఠీ తొలగిపోయి సర్వ సంకల్పాలు నెరవేరుతాయని అన్నారు. మార్కండేయ పంతులుచే గోపూజ, వారి అనుగ్రహ భాషణం ఉంటుందని, అలాగే ప్రధాన వక్త గోల్కొండ నాగరాజు జిల్లా కార్యవాహ్ బౌద్ధిక్ వుంటుందని అన్నారు. శుక్రవారం పౌర్ణమి రోజున అందరు తమ తమ ఇండ్లలో అలుకుచల్లుకుని ఇంటిల్లిపాదు అందరు రావాలని అన్నారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కట్కాపూర్, దావన్ పల్లి, వస్తాపూర్, తాట్లవాయి, కైరిగూడెం, ధర్మాజీపేట్, అల్యానాయక్ తండా గ్రామాల మహిళా మూర్తులు అందరు మంగళహారతులతో రావాలని, శ్రీహనుమాన్ భక్తులు వచ్చి సామూహిక చాలీసా పారాయణం లో పాల్గొనాలని, వచ్చిన భక్తులకు భోజన వ్యవస్థ కలదని వేలాదిగా తరలివచ్చి



కార్యక్రమం విజయవంతం చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమం లో అత్తినేని శ్రీనివాస్, బయ్యని గోపాల్, కాశయ్య, అమ్ముల మల్లయ్య, కాశవేని రాజేందర్, కాసాల లక్ష్మీనారాయణ, నాయిని రాజు, అత్తినేని వేణు, బొడ్డు మల్లేషం, మైదం శ్రీను, ఈట్నేని భాగ్య లక్ష్మీ, కాసాల గంగవ్వ తదితరులు పాల్గొన్నారు.

# బహుజనుల ఐక్యతే రాజ్యాధికారానికి మార్గం

## -- ఓయూలో పూలే--అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 28: బహుజన సమాజం ఐక్యంగా ముందుకు సాగితేనే రాజ్యాధికార సాధ్యమవుతుందని పలు వక్తలు పేర్కొన్నారు. ఓయూ ఆర్ట్స్ కళాశాలలో పూలే--అంబేడ్కర్ మహనీయుల జయంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.వెనుకబడిన కులాల సమాఖ్య (బిసిఎఫ్), బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం (బీసీఐఎఫ్), దళిత్ బహుజన్ స్టూడెంట్ అసోసియేషన్ (డిబిఎస్ఏ) తదితర విద్యార్థి, సామాజిక సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బిసిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. చెన్న రాములు సభాధ్యక్షత వహించారు. 42% బీసీ రిజర్వేషన్ పోరాట సమితి కో-ఆర్డినేటర్ డా. అవ్వారు వేణుకుమార్ స్వాగతం పలికారు. డిబిఎస్ఏ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జంగిలి దర్శన్ సమావేశ లక్ష్యాలు వివరించారు.ముఖ్య అతిథిగా హాజరైన బీసీఐఎఫ్ చైర్మన్ టీ. చిరంజీవులు మాట్లాడుతూ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు కలిపి 85 శాతం జనాభా ఉండటంతో, వారు ఐక్యంగా పోరాడితేనే రాజ్యాధికారాన్ని సాధించగలమన్నారు. 42% బీసీ రిజర్వేషన్ల సాధన, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ, యువతలో నాయకత్వ అభివృద్ధి కోసం ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.విశిష్ట అతిథిగా పాల్గొన్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ, బహుజన ఐక్యతే సామాజిక న్యాయం, రాజ్యాధికార సాధనకు మూలాధారం అని పేర్కొన్నారు. ఓయూ ప్రొఫెసర్ రాం షెఫర్డ్ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిబాపూలే, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్



ఆశయాలను సరిగ్గా అర్థం చేసుకుంటేనే నిజమైన సామాజిక మార్పు సాధ్యమవుతుందని తెలిపారు.డిబిఎస్ఏ వ్యవస్థాపక అధ్యక్షుడు డా. నలిగంటి శరత్ చమార్ మాట్లాడుతూ, మహనీయుల స్ఫూర్తితో బహుజన సమాజం ఏకమై ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, సామాజిక కార్యకర్తలు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగుతూ, బహుజన హక్కుల సాధనకు సంఘటిత పోరాటం అవసరమనే సందేశాన్ని వెలువరించింది.

# కుషాయిగూడలో 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం

కాప్రా, వార్తా మిర్రర్, ఏప్రిల్ 28 : హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో కుషాయిగూడ బజరంగ్ దళ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో నిర్మిస్తున్న 54 అడుగుల భారీ హనుమాన్ విగ్రహ నిర్మాణం తుది దశకు చేరుకుంది. మే ఒకటిన శుక్రవారం వైశాఖ శుద్ధ పౌర్ణమి స్వాతి నక్షత్ర సుముహూర్తంలో విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భారీ హనుమాన్ విగ్రహంతో పాటు మూలవిరాట్ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి, వినాయక విగ్రహాల యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్ట నిర్వహించనున్నారు. 28 మంగళవారం సాయంత్రం దేవత



మూర్తుల గ్రామోత్సవం ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. 29వ తేదీన ఉదయం, సాయంత్రం హోమాలు, దేవతామూర్తుల జలాధివాసం, 30వ తేదీ గురువారం ఉదయం, సాయంత్రం హోమాలు, ధాన్యాధివాసం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ ప్రతిష్ట కార్యక్రమాలను శ్రీ హంపి వీరుపాక్ష విద్యారణ్య భారతి స్వామి, శ్రీ యోగానంద సరస్వతి స్వామి (అదిలాబాద్), శ్రీశ్రీశ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి, శ్రీ చిట్టి పెద్ది రామశర్మ గార్ల ఆధ్వర్యంలో వైదిక బ్రాహ్మణులు యంత్ర మంత్ర ప్రాణ ప్రతిష్టగా నిర్వహించనున్నారు. విగ్రహ విశేషాలు ఆకట్టుకుంటున్నాయి. 54 అడుగుల ఎత్తుతో నిర్మించిన ఈ విగ్రహ కిరీటాన్ని రాజస్థాన్ జైపూర్ నుంచి తెప్పించిన జర్మాన్ రత్నంతో అలంకరించారు. స్వామివారి సహజ నేత్రాలను (మనిషి కళ్లలా కనిపించే విధంగా) తమిళనాడు నుంచి



ప్రత్యేకంగా తీసుకొచ్చారు. హృదయ భాగంలో అయోధ్య బాల రాముని దివ్యమంగళ స్వరూపాన్ని ప్రతిష్టించారు. ఆలయ గర్భగుడిలో మూలవిరాట్ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామితో పాటు నవహనుమాన్ మూర్తులను ఏర్పాటు చేశారు. అలాగే ఆలయ ముఖద్వారం ఇరువైపులా ఒకవైపు శివపార్వతులు, మరోవైపు లక్ష్మీనారాయణ మూర్తులను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమాల్లో హనుమాన్ విగ్రహ నిర్మాణ సమితి, కుషాయిగూడ బజరంగ్ దళ్, కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నిర్మాణ పనులకు సహకరించిన ప్రతి ఒక్కరికి కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులపాటు జరిగే ప్రతిష్ట పూజ కార్యక్రమాలను విజయవంతం చేయాలని భక్తులను కోరారు.

# బిఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...

## మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 27

చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే ధ్యేయంగా 2001లో కేసీఆర్ స్థాపించిన తెలంగాణ రాష్ట్ర సమితి (ప్రస్తుతం బి.ఆర్.ఎస్), నేటికి 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పార్టీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. 2014లో స్వరాష్ట్రాన్ని సాధించి, దేశంలోనే అగ్రగామిగా నిలిపిన ఘనత కేసీఆర్ దేనని వారు కొనియాడారు. కేసీఆర్ నాయకత్వంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, రానున్న రోజుల్లో ప్రజల ఆశీస్సులతో ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.ఈ వేడుకల్లో ప్రస్తుత వేసవి దృష్ట్యా పాదచారులకు, ప్రజలకు ఉపశమనం కలిగించేలా మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్,ఉదరి యాదయ్య, సింగల్ విండో మాజీ చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు గిర్కటి నిరంజన్ గౌడ్,మాజీ మార్కెట్ చైర్మన్ బొడ్డు శ్రీనివాస్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి పెద్దింటి బుచ్చిరెడ్డి, ఉడుగు మల్లేశం,తాడూరి పరమేష్,మునుకుంట్ల



సత్యనారాయణ,ఢిల్లీ శంకర్ రెడ్డి, ఎండి అతర్ పాషా, ఎండి మున్నా, జమీర్, చుక్క యాదయ్య, చేవగోని మహేష్ గౌడ్, జాని యాదవ్, ఊదరి శ్యామ్, గుండెబోయిన వెంకటేశం యాదవ్, నాగరాజు, ఆరుట్ల లింగస్వామి, ఇమ్మడి ఈశ్వర్, ఊదరి రాజేష్,అత్తు, శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు...

# విశాల భారతి పాఠశాలలో ఘనంగా సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవం..






వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 27 శ్రీ గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ ఆధ్వర్యం లో నిర్వహించబడుతున్న విశాల భారతి హై స్కూల్ యొక్క సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిఆర్ గార్డెన్, ఫంక్షన్ హాల్ లో అంగరంగ వైభవంగా సమ్మర్ క్యాంపు ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బండారు సుజాత శేఖర్, ఆంటోనీ, మున్సిపల్ కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఆంటోనీ ఈ సమ్మర్ క్యాంప్ యొక్క 12 అంశాల గూర్చి వివరించడం జరిగింది. సుజాత శేఖర్ మాట్లాడుతూ వేసవి సెలవులను వృధా చేయకుండా సమ్మర్ క్యాంపులో విద్యార్థినీ విద్యార్థులకు తగు సూచనలు చేస్తూ విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా వేదిక్ మ్యాస్, విద్యార్థుల జ్ఞాపకశక్తిని, ఎలా మెరుగుపరుచుకోవాలో వివిధ కృత్యాల గూర్చి, చేతిరాతను మెరుగుపరుచుకునే విధానం గూర్చి జీవితంలో ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో 10వ తరగతి విద్యార్థుల యొక్క వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థుల ను విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య కాంతి వర్ధన్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తులో ఉన్నతమైన లక్ష్యాలను ఏర్పరచుకొని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వీసం చైతన్య క్రాంతి వర్ధన్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్ ఆవుల అశోక్, ఆందోజు నాగభూషణం, మున్సిపల్ కౌన్సిలర్ కాసర్ల మంజుల శ్రీనివాస్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, సమ్మర్ క్యాంప్ కోఆర్డినేటర్ ఆంటోని, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు..

## నేడే ఓజీఏ ఎన్నికలు--2026:

## 'వైబ్రెంట్ ప్యానెల్'కు మద్దతు కోరిన భాగ్యనారాయణ

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఏప్రిల్ 28 :

Osmania Graduates Association (zJ@) మేనేజింగ్ కమిటీ ఎన్నికలు--2026 నేడు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ప్రచారం ఉత్సాహంగా సాగుతుండగా, ప్రొఫెసర్ జి. భాగ్యనారాయణ నేతృత్వంలోని 'వైబ్రెంట్ ప్యానెల్'కు మద్దతు తెలపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఎన్నికలు ఏప్రిల్ 29న సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు Exhibition Grounds, నాంపల్లి వేదికగా నిర్వహించనున్నారు. ఓటర్లు తప్పనిసరిగా ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ వంటి ప్రభుత్వ గుర్తింపు పత్రాలు వెంట తీసుకురావాలని నిర్వాహకులు సూచించారు.అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న ప్రొఫెసర్ జి. భాగ్యనారాయణ మాట్లాడుతూ, విద్యారంగంలో తన అనుభవంతో పాటు సమర్థులైన విద్యావేత్తలతో కూడిన తమ ప్యానెల్‌ను గెలిపించాలని కోరారు. విద్యా నాణ్యత పెంపు, ఉపాధి ఆధారిత కోర్సుల ప్రవేశపెట్టడం, కళాశాలల ఆర్థిక స్థిరత్వం సాధన వంటి లక్ష్యాలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.ఈ ప్యానెల్‌లో ఉపాధ్యక్షుడిగా ప్రొఫెసర్ గుజ్జ గోపాల్ రెడ్డి, కార్యదర్శిగా డా. బి. ప్రభా శంకర్, సంయుక్త కార్యదర్శిగా అశ్విన్ మార్గం, కోశాధికారిగా పి. శ్రీనివాస్ సహా పలువురు సభ్యులు పోటీలో ఉన్నారు.విద్యావేత్తలు, నిపుణులతో కూడిన తమ బృందానికి మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని గ్రాడ్యుయేట్లను మేనేజింగ్ కమిటీ సభ్యులుగా పోటీ చేస్తున్న పి. లక్ష్మీనారాయణ కోరారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా సురేఖ



కాప్రా, వార్త మిర్రర్, ఏప్రిల్ 28 : భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా శ్రీమతి పులుగు గిరకబావి సురేఖను నియమించారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆత్మకూరి కాంతి కిరణ్ ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు.బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ గౌతమ్ రావు, సురేఖకు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కాంతి కిరణ్ మాట్లాడుతూ పార్టీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. నీతి, నిజాయితీతో క్రమశిక్షణ పాటిస్తూ సహచర కార్యకర్తలు, పార్టీ కమిటీలతో సమన్వయంగా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు.తన నియామకానికి సహకరించిన మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. మల్లారెడ్డికి సురేఖ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



## అష్టమ బ్రహోత్సవముల భాగంగా రెండవ రోజు సుప్రభాత సేవ,భజన

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి ఏప్రిల్ 28జగిత్యాలలో శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయమ, చింతకుంట చెరువు దగ్గర, మంగళవారం రోజున అష్టమ బ్రహ్మోత్సవములు రెండవ రోజు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, అనంతరం జగిత్యాల సత్సంగ సభ్యుల చే భజన కార్యక్రమము, చల్ గల్ సత్యంగ సభ్యుల ఆధ్యర్యములో హరే రామ- హరే కృష్ణ నామ సంకీర్తన చేసారు..యిట్టి కార్యక్రమాలు ఆలయ అర్చకులు శ్రీ రామానుజ ఆచార్య ప్రణయ్ కుమార్, నరేష్, శ్రీ హరి పర్యవేక్షణలో జరిగినాయి. ఈ కార్యక్రమము నందు దేవాలయ ట్రస్ట్ ఫౌండర్ అండ్ చైర్మన్. డాక్టర్. వడ్లగట్ట రాజన్న, అధ్యక్షులు ముత్యాల రామలింగారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్- లత, మేనేజింగ్ ట్రస్టీ గట్టు రాజేందర్, ప్రధాన కార్యదర్శి వడ్ల గట్ట శంకర్, కోశాధికారి వడ్లగట్ట స్వాతి- గోపి, సహాయ కార్యదర్షి భారతాల రాజసాగర్- గీత, చెన్నూరి శ్రీధర్, వేముల రాజేష్,అల్లీపూర్ బండారి ముత్తన్న, చల్గల్ పడాల శంకర్ చారి, హనుమాన్ వాడ పూరేల్లి రాజన్న, మాతలు, భక్రులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యక్రమం విజయవంతం చేశారు.

## 10వ వార్డు అధ్యక్షునిగా పోలోజు శ్రీనివాస చారి ఎన్నిక..



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 27

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్ 10 వ వార్డ్ కౌన్సిలర్ దేప రమ్యరాజు ఆధ్వర్యంలో పదో వార్డు అధ్యక్షునిగా పోలోజు శ్రీనివాస చారి ప్రధాన కార్యదర్శిగా దేప నరేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బొడిగె అరుణ బాలకృష్ణ గౌడ్, ఐ ఎన్ టి సి చౌటుప్పల్ మండల ప్రధాన కార్యదర్శి మహమ్మద్ చాంద్ పాషా,ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ చింతల మహేందర్,గోశిక నరసింహ,ఎరుకలి సాయి,మాజీ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ జాఫర్ తదితరులు పాల్గొని నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగినది

## కుప్పకూలుతున్న బంగారం, వెండి..

## భారీగా తగ్గిన ధరలు.. ఎంత తగ్గిందంటే..

దేశీయంగా బంగారం, వెండి ధరలు నేడు ఊహించని విధంగా తగ్గుముఖం పడుతున్నాయి. డాలర్ బలహీన పడటం, అమెరికా-ఇరాన్ మధ్య నిలిచిపోయిన శాంతి చర్చల్లో పురోగతి నెలకొనడం వంటివి దీనికి ప్రధాన కారణాలు అయ్యాయి. ఈ నెలాఖరుకు బలహీనమైన ధోరణిని కొనసాగించాయి. గత మూడు రోజుల కిందట పెరిగిన పసిడి, వెండి రేట్లు నేడు మళ్లీ నేలచూపులు చూడటం మొదలుపెట్టాయి.: మహిళలకు శుభవార్త చెబుతున్నాయి బంగారం, వెండి ధరలు. ఏప్రిల్ 29, 2026 (బుధవారం) నాటి తాజా సమాచారం ప్రకారం, బంగారం, వెండి ధరలలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావంతో దేశీయంగా ధరలు కొంత తగ్గుముఖం పట్టాయి. గతంలో వినియోగదారులకు చుక్కలు చూపించిన గోల్డ్, సిల్వర్ ధరలు.. ప్రస్తుతం భారీ స్థాయిలో దిగి రావడం ఎంతో ఉపశమనం కలిగిస్తున్నాయనే చెప్పాలి. హైదరాబాద్ సహా ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు భారీగానే తగ్గాయి. హైదరాబాద్- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,350 (సుమారు రూ.2,540 తగ్గింది). 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,50,930 (సుమారు రూ.2,770 తగ్గింది).ఢిల్లీ -- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,490 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,51,070 వద్ద కొనసాగుతోంది.ముంబై- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,38,340 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,50,920 వద్ద కొనసాగుతోంది.చెన్నై -- 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,40,990 ఉండగా, అదే 24 క్యారెట్ల (ప్యూర్) బంగారం ధర రూ.1,53,810 వద్ద కొనసాగుతోంది.వెండి ధరలు (1 కేజీకి):వెండి ధరలు ప్రస్తుతం స్థిరంగా కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల స్వల్ప మార్పులు కనిపించినప్పటికీ, సగటు ధరలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్/విజయవాడలో కిలో బంగారం ధర రూ.2,69,900. ఉండగా, దేశవ్యాప్తంగా సగటు: రూ.2,60,000 నుండి రూ.2,65,000 మధ్యలో ఉంది.అంతర్జాతీయ ప్రభావం: అమెరికా డాలర్ బలోపేతం కావడం, గ్లోబల్ మార్కెట్‌లో ముడిచమురు ధరల హెచ్చుతగ్గుల వల్ల పసిడి ధరలపై ఒత్తిడి పెరిగింది.